క్లుప్తంగా

ఉచిత హాస్టల్ సదుపాయానికి దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ ఇతర కోర్సులను చదువుతున్న ఆర్యవైశ్య విద్యార్థులకు తెనాలిలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగానమ్మపేటలోని వైశ్య విద్యానిధి హాస్టల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు ఇస్తున్నట్లు చెప్పారు. తెనాలి, పరిసర ప్రాంత, ఇతర జిల్లాల వాసులు కూడ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు హాస్టల్‌లో సంప్రదించాలని సూచించారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి అన్నమయ్య పురస్కారం

తెనాలిరూరల్: మండల గ్రామం కొలకలూరుకు చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి అన్నమయ్య పురస్కారానికి ఎంపికయ్యారు. చిత్తూరుజిల్లా బైరెడ్డిపల్లి మండలం గొల్లచీమన గ్రామానికి చెందిన ఆంధ్ర కళల పరిరక్షణ సమితి, ఏఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషకు, కళారంగానికి, నృత్య, సంగీత రంగాలకు సేవలు అందించిన వారికి ఈ నెల 26న పురస్కారాలు అందజేయనున్నారు. ఈ క్రమంలో ప్రజ్ఞాచారిని అన్నమయ్య పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు ఆంధ్ర కళల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మెడవలి చిరంజీవి మంగళవారం తెలిపారు.

టూ టౌన్ పరిధిలో తనిఖీలు

తెనాలిరూరల్: తెనాలి టూ టౌన్ సర్కిల్ కార్యాలయం పరిధిలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. స్థానిక నందులపేట శివారు భాస్కరావుదిబ్బలో ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అలానే సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ ఎ. సుధాకర్ తెలిపారు.

మేధోశక్తిని పెంపొందించేందుకే సమ్మర్ క్యాంప్

కొల్లిపర: విద్యార్థులు వేసవి సెలవుల్లో కాలాన్ని వృథా చేయకుండా వారిలో మేధాశక్తిని పెంపొందించేందుకే గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపును నిర్వహించటం జరుగుతుందని ఎంఈవో కె.జాన్సీలత సూచించారు. మంగళవారం గుడిబండివారిపాలెం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సమయం వృథా చేయకుండా చదువుకోవటం వలన కలుగే ప్రయోజనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి బి.సుబ్బారావు, రీసోర్స్ పర్సన్ ఎ.శ్రవంతి, సీఆర్‌పి పి.రమేష్ పాల్గొన్నారు.

పౌరాణిక రంగస్థల నటుడు ఆరాధ్యులకు ఘనసత్కారం



తెనాలి: శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాల్లో బాగంగా కఠెవరం గ్రామంలో సోమవారం రాత్రి పౌరాణిక పద్యనాటకాలు ప్రదర్శించారు. ఇదే వేదికపై తెనాలికి చెందిన ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు ఆరాధ్యుల ఆదినారాయణకు ఇటీవల డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఆయన్ను పూలమాలలు, దుశ్శాలువతో సత్కరించారు. భవానీ శంకరుడి పాత్రలో తనకు శిక్షణనిచ్చి తీర్చిదిద్దిన గురువు ఆదినారాయణకు ఆయన శిష్యుడు తాడిబోయిన నాగేశ్వరరావు బంగారు ఉంగరం బహూకరించారు. డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం సన్మానపత్రం రాసి స్వయంగా అందజేశారు. బ్రహ్మంగారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సత్కారంలో నటులు ఫణి కుమార్, కుమార్ బాబు, రామలింగేశ్వరరావు, సంగమేశ్వర వేంకటేశ్వరరావు, గంపల శివనాగేశ్వరరావు, దూళ్ల అప్పయ్య, సూర్యం, వందనం తదితరులు ఆదినారాయణ కళారంగ సేవలను కొనియాడారు.

నెహ్రూనికేతన్‌కు ఉత్తమ పాఠశాల పురస్కారం



తెనాలిఅర్బన్: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలను జాతీయ స్థాయిలో ఏడొవ ఉత్తమ పాఠశాల పురస్కారానికి లీడ్ స్కూల్ నిర్వాహకులు ఎంపిక చేశారని నెహూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ గీతాకాంత్‌లు తెలిపారు. స్కూల్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లీడ్ స్కూల్ వారు జూన్‌లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాన్ని లీడ్ స్కూల్ వ్యవస్థాపకులు సుమిత్ మెహతా, కో–సీఈవో సుమిత్ దేవ్‌రాహీలు అందజేయనున్నట్లు చెప్పారు. దేశంలో లీడ్ స్కూల్ కరికులంను అమలు చేస్తున్న మూడువేల పాఠశాలల్లో తమ పాఠశాల ఒకటని తెలిపారు. తమ పాఠశాల ఉత్తమ పురస్కారానికి ఎంపిక కావటం సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు.


హెపటైటిస్.. అశ్రద్ధ చేస్తే డేంజరస్!

- లివర్ క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం
- వ్యాక్సిన్ చేయించుకుంటే వ్యాధి సోకదు
- మే హెపటైటిస్ అవగాహన మాసం

గుంటూరు మెడికల్: సైలెంట్ కిల్లర్‌గా పిలవబడే హెపటైటిస్ వ్యాధితో ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 1.4 మిలియన్ల మంది మరణిస్తున్నారు. మన దేశంలో 4.5 కోట్ల మంది ప్రజలు ఈ వ్యాధి బారిన పడినట్లు జాతీయ వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతి ముగ్గురిలో ఒకరు హెపటైటిస్‌తో బాధపడుతున్నారు. అయితే వ్యాధి సోకినవారిలో 80 శాతం మంది ప్రజలకు వ్యాధిపై, చికిత్సలపై అవగాహన లేదు. దీంతో ప్రతి ఏడాది మే నెలను హెపటిటిస్ అవగాహన మాసంగా నిర్ణయించి ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

కాలేయానికి వచ్చే వ్యాధి...

హెపటైటిస్ కాలేయానికి సంబంధించిన వ్యాధి. హెపటైటిస్ బి వైరస్ ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధిని కలుగచేసే వైరస్ శరీరంలోకి ఒకసారి వస్తే క్రమేపి వైరస్‌ల సంఖ్య లక్షల్లో పెరిగిపోయి లివర్‌ను దెబ్బతీస్తుంది. వ్యాధిలో ఎ, బి, సి,డి,ఇ రకాలు ఉన్నా వాటిలో బి, సి ప్రాణాంతకం. గుంటూరు జీజీహెచ్‌లో 2020 నుంచి నుంచి 2024 మార్చి వరకు 14,371 మందికి హెపటైటీస్ బి స్క్రీనింగ్ పరీక్షలు చేసి 1200 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించారు. హెపటైటీస్ సీ స్క్రీనింగ్ పరీక్షలు 9,943 మందికి చేసి 450 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించారు.



హెపటైటిస్ నెల పోస్టర్లు

వ్యాధి సోకే విధానం...

- ఇన్‌ఫెక్ట్ అయిన రక్తపు ఉత్పత్తుల ద్వారా..
- శరీరంలో ఊరే వివిధ ద్రవాల ద్వారా(వీర్యం, యోని ప్రవాలు, మూత్రం)
- సురక్షితం కాని సంభోగం ద్వారా ..
- ఒకరికి వాడిన ఇంజెక్షన్ సూదిని వేరొకరికి వాడటం ద్వారా, టాటూలు వేసుకోవటం, ముక్కు, చెవులు కుట్టుకోవటం, ఒకరేజర్ బ్లేడ్‌ను అనేక మంది వాడటం, ఒకరు వాడిన టూత్ బ్రష్‌ను మరొకరు వాడటం ద్వారా
- అసురక్షితమైన రక్తదానం ద్వారా, వైరల్ కల్గి ఉన్న గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు హెపటైటిస్–బి, సి వ్యాధులొస్తాయి. వ్యాధి సోకిన వారిలో తమకు వ్యాధి ఉన్నట్లు ఏ విధమైన లక్షణాలు కనిపించకపోవటంతో వారి ద్వారా ఇతరులకు వ్యాధి సోకుతుంది. వయస్సుతో సంబంధం లేకుండా ఈ వ్యాధి అందరికీ సోకుతుంది.

వ్యాధి లక్షణాలు...

కాలేయం వాచిపోయి మూత్రం పసుపుపచ్చగా వస్తుంది. కళ్లు, శరీరం, నాలుక తదితర భాగాలన్నీ పసుపు పచ్చగా మారిపోతాయి. దీనినే పచ్చకామెర్లు అంటారు. వ్యాధి ప్రారంభ దశలో తేలికపాటి జ్వరం, ఆకలి మందగించటం, రక్తపు వాంతులవ్వటం, వ్యక్తి బాగా బలహీనపడటం, పొట్ట ఉబ్బరం, కాళ్ల వాపులు, కీళ్ల నొప్పులు ఉంటాయి. కొంతమంది పరిస్థితి ఇంకా భయంకరంగా ఉంటుంది. శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. కాలేయం సరిగా పనిచేయక మృత్యువుకు దారితీస్తుంది.

గుంటూరు జీజీహెచ్‌లో ఉచిత వైద్యం

హెపటైటీస్‌ను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించేందుకు ప్రభుత్వం గుంటూరు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా హెపటైటీస్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని 2020 నవంబరులో ప్రారంభించింది. హెపటైటీస్ స్క్రీనింగ్ పరీక్షలు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ వైద్య విభాగంలో సోమవారం నుంచి శనివారం వరకు చేస్తారు. వైద్య పరీక్షలు చేసి నిర్ధారణ అయిన వారికి నెలకు సుమారు రూ. 20వేలు ఖరీదు చేసే మందులు సైతం ఉచితంగా అందిస్తున్నారు.

వ్యాక్సిన్ చేయించుకోవాలి..



హెపటైటిస్– బి వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు. ఈ వ్యాధికి వ్యాక్సిన్ ఉంది కాని వ్యాధి వచ్చాక నయం కాదు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు వ్యాక్సిన్లు చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చు. హెపటైటిస్–సి వ్యాధికి వ్యాక్సిన్ లేదు కాని వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే వైద్యం చేసి నయం చేయవచ్చు.

–డాక్టర్ ఆళ్ల సిద్దార్థ రెడ్డి,
గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

లివర్ క్యాన్సర్‌కు కారణం కావొచ్చు..



లివర్ క్యాన్సర్లు రావటానికి హెపటైటిస్– బి, సి వ్యాధులే కారణం. కామెర్ల వ్యాధి సోకిన వారు తప్పనిసరిగా హెపటైటిస్ వ్యాధి ఉందా లేదా అని నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. శరీరంలో హెపటైటిస్ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం ఉంటే క్రానిక్ హెపటైటిస్‌కు దారితీసి కొన్నేళ్ల తరువాత లివర్ దెబ్బతినటానికి కారణమవుతుంది. దీని వల్ల లివర్ క్యాన్సర్, లివర్ ఫెయిల్యూర్, లివర్ సిరోసిస్ వస్తుంది.

– డాక్టర్ బైరపనేని స్రవంతి,
క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు

అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలి



కొల్లిపర: రైతులు ప్రతి పంటల్లో వ్యవసాయాధికారుల సూచనలు మేరకు ఏఏ పంటలు సాగుచేయాలి, ఎరువులు ఎంత మోతాదులో వాడాలి అన్న అంశాలను తెలుసుకుని పాటించటం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించటం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ సి.సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం పై రైతులకు , రావెప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.సంధ్యారాణి, ప్రొఫెసర్ సువర్ణలత సేంద్రియ వ్యవసాయం, జాతీయ సేవా పథకంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు కొల్లిపర గ్రామంలో వివిధ గృహాలను సందర్శించి సామాజిక ఆర్థిక నివేదికలను సేకరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ కిషోర్‌బాబు, టీఓటీ వెంకట రాములు, అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ట్రెజరర్ బి.ప్రభాకర్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ అవుతు కృష్ణారెడ్డి, ఏవో కె.వెంకటరావు పాల్గొన్నారు.

చెట్లు నరికితే వాతే...!

- శ్యామలనగర్ బాలకుటీర్ రోడ్డులో ఇటీవల చెట్టు నరికేసినట్లు ఫిర్యాదు అందడంతో అక్కడికి వెళ్లిన నగరపాలక సంస్థ ఏడీహెచ్(అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్) చెట్టు నరికిన వారికి రూ.30వేలు జరిమానా విధించి, వసూలు చేశారు.

- రాజేంద్రనగర్‌లో ఓ ఇంటి ముందు అడ్డుగా ఉన్న చెట్టును నరికేసినందుకు గాను సదరు వ్యక్తి నుంచి రూ.25వేలు అపరాధ రుసుం వసూలు చేశారు.

- వాల్టా చట్టం కింద కఠిన చర్యలు
- నాన్‌బెయిలబుల్ కేసులు సైతం..
- చెట్టు వయసును బట్టి రూ.30వేల వరకు జరిమానా
- చెట్లు నరికినందుకు గాను ఏడాది కాలంలో రూ.3.05లక్షల జరిమానా వసూలు


లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో చెట్టు నరికేసిన దృశ్యం(ఫైల్)


విజయపురి కాలనీలో నరికేసిన చెట్టు (ఫైల్)

నెహ్రూనగర్: నగరంలో ఒక పక్క జగనన్న హరిత నగరాల్లో భాగంగా చెట్లను, గ్రీనరీ అభివృద్ధి చేసి పర్యావరణ అభివృద్ధితో పాటు నగర సుందరీకరణకు చర్యలు తీసుకుంటుంటే కొంత మంది బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ చెట్లు నరికేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించేవి చెట్లు. అటువంటి చెట్లు రకరకాల కారణాలతో నేల కొరుగుతున్నాయి. ఈ చర్యలు పర్యావరణానికి గొడ్డలి పెట్టుగా మారాయి. అనుమతి లేకుండా చెట్లు నరికినందుకు నగరపాలక సంస్థ అధికారులు గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం ఏప్రిల్ వరకు రూ.3.05లక్షలు అపరాధ రుసుం(చలనా) విధించి, వసూలు చేశారు.

నాన్ బెయిలబుల్ కేసులు నమోదు..

పర్యావరణ సమతుల్యత, ప్రజారోగ్య రక్షణలో చెట్లు కీలకంగా ఉంటాయి.. కొందరు అనాలోచితంగా, స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను తొలగిస్తున్నారన్నారు. ఇంటి ముందు ఉన్న చెట్ల ఆకులు రాలుతున్నాయని, కొమ్మలు ఇంటి మీదకు వాలిపోతున్నాయని, ఇంటి ముందు వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి వంటి కారణాలతో చెట్లను తొలగించే వారిపై వాల్టా (వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్) 2002 ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

చెట్టు వయస్సును బట్టి జరిమానా..

చెట్లవలన ప్రమాదభరితమైన, ఇబ్బందికర పరిస్థితుల ఉంటే ముందస్తుగా నగరపాలక సంస్థకు అర్జీ దాఖలు చేయాలి. సంబంధిత అధికారులు పరిశీలించి, వాస్తవంగా ఇబ్బందికరంగా ఉంటే తొలగించేందుకు అనుమతులు ఇస్తారు. అనుమతి లేకుండా నరికివేస్తే చెట్టు వయస్సును బట్టి రూ. 4వేల నుంచి రూ.30వేల వరకు జరిమానా విధిస్తారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

పర్యావరణ పరిరక్షణ కోసం నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. కొంతమంది అనాలోచితంగా చెట్లు నరికేస్తూ పర్యావరణ పరిరక్షణకు హాని కలిగిస్తున్నారు. ఇప్పటికే నగరంలో చెట్లు నరికే వారిపై జరిమానా విధించడం లేదా వాల్టా చట్టం కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తున్నాం. నగరంలో ఎక్కడైనా చెట్లు నరికితే 9849908370 నంబర్‌కు సమాచారం ఇవ్వండి.

– రామారావు,
ఏడీహెచ్, నగరపాలక సంస్థ

కొత్తపేట పరిసర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్


కవాతు నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసులు రెడ్డి, సిబ్బంది

పట్నంబజారు: ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న తరుణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట పోలీసులు ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. కొత్తపేట ఎస్ఐ తరంగిణి ఆధ్వర్యంలో నెహ్రూనగర్, బుచ్చయ్యతోట, కొత్తపేట, రామిరెడ్డితోట, ఆర్టీసీ బస్టాండ్, గుంటూరువారితోట, పొత్తూవారిపేట, పరిసర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ జరిగింది. కేంద్ర బలగాలతో కలిసి ప్రజల్లో ధైర్యం నింపేలా మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తరంగిణి మాట్లాడుతూ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమీపిస్తున్న తరుణంలో ఎలాంటి వివాదాలు, ఘర్షణలు జరుగకుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ధైర్యం కల్పించేలా కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, కేంద్ర బలగాలు తదితరులు పాల్గొన్నారు.

అరండల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో...

గుంటూరు ఈస్ట్: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం కవాతు నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసులు రెడ్డి అదనపు బలగాలతో శారదా కాలనీ, పరిసర ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ఐకమత్యంతో మెలగాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ రోజు, తరువాత రోజుల్లో అల్లర్లకు పాల్పడితే అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈసమయంలో నమోదయ్యే కేసులు జీవితాంతం ఉంటాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఎస్ఐ తరంగిణి, సిబ్బంది

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి జయంతి


పంచామృత అభిషేకంలో పరశివానంద భారతి, చైర్‌పర్సన్ రాధిక తదితరులు


హారతిని స్వీకరిస్తున్న భక్తులు

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీలక్ష్మీ నృసింహ స్వామి జయంతి వ్రతం, పంచామృత అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీపరశివానంద భారతి స్వామి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాన్ని కన్నుల పండువగా జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, కె.శివరామిరెడ్డి, ఎన్.బాలసుబ్రహ్మణ్యం, విజయకుమారి, భార్గవ్ పర్యవేక్షించారు. జూన్ ఒకటో తేదీన శ్రీహనుమత్ జయంతి సందర్భంగా అభయ వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన ఉంటాయని చంద్రశేఖరరెడ్డి తెఇపారు. జూన్ అయిదో తేదీన శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్నసమారాధన ఉంటాయని, భక్తులు విచ్చేసి పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. స్వామివారి పంచామృత అభిషేకాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక–రమేష్ దంపతులు దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. మున్సిపల్ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, వివిధ రంగాల ముఖ్యులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు దగ్ధం

తెనాలి: పట్టణంలో కేబుల్ టీవీలకు తోడు రకరకాల ఇంటర్‌నెట్ సర్వీసులు రంగప్రవేశం చేశాయి. వీటి లైన్ల కోసం విద్యుత్ స్తంభాలను వినియోగిస్తుండటం తెలిసిందే. రకరకాల వైర్లు, కేబుల్స్ విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోతున్నాయి. విద్యుదాఘాతంతో అప్పుడప్పుడు అగ్నిప్రమాదాలు జరుగుతుండటం పరిపాటైంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో నాజరుపేటలో ఇదే తరహా ప్రమాదం జరిగింది. చెరువువారి వీధి, పులిపాకవారి వీధి మలుపులో గల స్తంభానికి అగ్నిప్రమాదం సంభవించింది. దిగువ నుంచి పైవరకు వున్న కేబుల్ వైర్లు, ఇంటర్నెట్ వైర్లు అన్నీ తగులబడి పోతుండటాన్ని నిద్రలో ఉన్న స్థానికులు గమనించారు. వీరు ఇచ్చిన సమాచారంతో విద్యుత్ శాఖ డీ1 ఏఈకి దుర్గారావు స్పందించి, విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. స్థానికులు అప్రమత్తం కాకపోతే మంటల సమీప గృహాలకు వ్యాపించేవని చెబుతున్నారు. పట్టణంలో ఇలాంటి ప్రమాదాలు జరగటం ఇది ఆరోసారని తెలిసింది.

సివిల్ సర్వీసెస్‌తో దేశసేవ చేసే అవకాశం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ పాలనా రంగంలో రాజకీయ వ్యవస్థలకు భిన్నంగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల ద్వారా లభిస్తుందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. కె.వి.ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పది రోజుల ఐఏఎస్ ఫౌండేషన్ అవగాహన తరగతులు స్థానిక బ్రాడీపేట యూటీఎఫ్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రారంభించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ భిన్న సంస్కృతులు, ఆర్థిక సామాజిక అసమానతలను తగ్గించేందుకు అధికారులుగా ఐఏఎస్‌లకు తమ పాలన ద్వారా ప్రత్యేక పాత్ర ఉంటుందన్నారు. ఒక జిల్లా కలెక్టర్ తన పాలనలో ఆ జిల్లా రూపురేఖలను మార్చే అవకాశం హెచ్చుగా ఉంటుందని తెలిపారు. రాజకీయ అధికారాలు కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే ఉంటాయని సివిల్ సర్వెంట్స్ మూడు దశాబ్దాలకు పైగా దేశ సేవలో పని చేసే అవకాశం రాజ్యాంగం కల్పిస్తున్నదన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే సర్వీస్ కమిషన్ రాష్ట్ర అధికారులు పనిచేస్తారని జాతీయస్థాయిలో సివిల్ సర్వీస్ కమిషన్ ద్వారా దేశ విదేశాలలో సేవ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సన్ ఆర్గనైజేషన్ కో–ఆర్డినేటర్స్ ఆశిష్, హరీష్, సంధ్యలు మాట్లాడుతూ గత దశాబ్ద కాలం పైగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు సహకారంతో సన్ ఆర్గనైజేషన్ విద్యార్థుల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ జనవిజ్ఞాన వేదిక నాయకులు సత్యనారాయణ ప్రసాద్, టీఆర్ రమేష్, సుబ్బారాయుడు, అధిక సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, వేదికపై ఎం.కళాధర్, ఆర్గనైజేషన్ కో–ఆర్డినేటర్స్

భక్తుల కొంగుబంగారం నృసింహస్వామి ఆలయం

నేడు స్వామివారి తిరు నక్షత్రం

నగరంపాలెం: గుంటూరు నగరంలోని ఆర్.అగ్రహారంలో కొలువైన లక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానం భక్తులకు కొంగు బంగారమై నిలిచింది. క్రీ.శ. 1370లో ఈ ఆలయం ప్రతిష్ట జరిగింది. వంగిపురం వెంకటాచార్యుడు అనే ఒక భక్తునికి స్వామివారు కలలో సాక్షాత్కరించి, తాను కొండవీటి కొండలలోని ఒక వల్మీకంలో ఉన్నానని తెలియజేశారు. అక్కడ నుంచి తమను తీసుకువచ్చి ఈ ప్రాంతంలో ప్రతిష్ఠంపచేయాలని కోరారు. స్వామి వారి ఆనతి ప్రకారం భక్తుడు తన మిత్రులతో కలిసి స్వామివారిని ఆర్.అగ్రహారంలో ప్రతిష్ఠంపచేశారు. సుమారు 50 రాతి స్తంభాలతో ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలో రాజ్యలక్ష్మీదేవి ఆలయం, సన్నిద్ధాక్వారుల ఆలయం, గరుడ, ఆంజనేయస్వామి వారి ఆలయం, ముఖ మండపం, కల్యాణ మండపం ఉన్నాయి. ఈ ఆలయం నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతుంది. ఆలయంలో పంచరాత్ర ఆగమ విధానంలో పూజాది కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక్కడ చైత్రమాసంలో కల్యాణోత్సవం, రథోత్సవం చైత్రశుద్ధ సప్తమి మొదలు పౌర్ణమి వరకు తొమ్మిదిరోజులు అంగరంగా వైభవంగా జరుగుతాయి. వంశపారంపర్య అర్చకులు స్వామి వారికి నిత్యం అర్చకత్వాన్ని నిర్వహిస్తున్నారు. దేవాలయాన్ని దేవదాయ, ధర్మాదాయ ఆధ్వర్యంలో నియమించిన ఫౌండర్ ట్రస్టీలు, ఎగ్జిక్యూటివ్ అధికారి పర్యవేక్షిస్తారు.


ఆర్.అగ్రహారంలో లక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానం

నేడు స్వామివారి తిరునక్షత్రం..

బుధవారం లక్ష్మీ నృసింహస్వామి తిరునక్షత్రం (జయంతి) భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఉదయం ప్రత్యేక పూజలు అర్చనలు జరుపుతారు. ఇందుకోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలకరించారు. సాయంత్రం కల్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తామని ఆలయ అర్చకులు నంద్యాల శ్రీనివాస ఆచార్యులు తెలిపారు.